క్లుప్తంగా

'ఎమ్మెల్యే చొరవతోనే ఎస్సారెస్పీ నీటి విడుదల'

వర్ధన్నపేట : రైతుల పంటలు ఎండిపోతున్న తరుణంలో స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు చొరవ తీసుకోవడం వల్లే ఎస్సారెస్పీ కాల్వలోకి నీరు విడుదలైందని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం(డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి తెలిపారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని కోనారెడ్డి, ఇతర చెరువులను, కాల్వలను మరమ్మతు చేయించి పంట పొలాలకు నీరందించే దిశగా ఎమ్మెల్యే నాగరాజు కృషి చేశాడని తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఎమ్మెల్యే మాట్లాడి నీరు విడుదల చేయించగా మాజీ మంత్రి దయాకర్‌రావు విడుదల చేయించినట్లుగా ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

విరాళం



పర్వతగిరి : మండలంలోని గోపనపల్లిలోని శ్రీ దూడల మల్లికార్జునస్వామి ఆలయానికి చావా (పల్లకి) కోసం గ్రామానికి చెందని కారింగుల సమ్మయ్య జ్ఞాపకార్థం అతడి భార్య ఉప్పలమ్మ, కుమారుడు కోడలు నర్సయ్య, కొమురమ్మ, ఇతర కుటుంబీకులు ఆదివారం రూ.21 వేల 116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బెల్లం రాధిక రాజు మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి దాతలు తోడ్పాటు అందించి సహకరించాలని కోరారు. ఆలయ పునర్నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

'ఛావా' చలనచిత్రానికి ప్రజాదరణ

వర్ధన్నపేట : పట్టణంలో ప్రదర్శితమవుతున్న 'ఛావా' చలనచిత్రానికి ప్రజాదరణ వెల్లువెత్తుతోంది. ఛత్రపతి శివాజీ జీవిత చరిత్ర ఆధారంగా చిత్రీకరించిన సదరు సినిమాను విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా ప్రదర్శించారు. మండలంలోని ఇల్లంద, తదితర గ్రామాలకు చెందిన వందలాది యువత, ప్రజలు చిత్రాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త మోడెం కుమారస్వామి మాట్లాడారు. ఛత్రపతి శివాజీ విద్యార్థి దశలో చేసిన యుద్ధాలు, హిందూ ధర్మ పరిరక్షణ కోసం చేసిన త్యాగం మరువలేనివని కొనియాడారు. శివాజీ జీవిత చరిత్రను ప్రజలకు అందించే దిశగా చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించినట్లు తెలిపారు. యువత శివాజీ స్ఫూర్తితో ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఐద రవి, పెద్దూరి రాజ్‌కుమార్, తాళ్లపెల్లి రమేశ్, జోగుల కుమారస్వామి, గద్దం శ్రీనివాస్, మహంత్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలికి గాయాలు

రాయపర్తి : బైక్ ఢీకొని వృద్ధురాలికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జేరుపోతు ఆగమ్మ స్థానిక వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆగమ్మకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆమెను 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

నివాళి

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయిని పహాడ్‌కు చెందిన కన్నెదారి నక్షత్రమ్మ (76) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి బీఆర్ఎస్ అనుబంధ రైతు సంఘం మాజీ మండల అధ్యక్షుడు పుట్టి భాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కన్నెదారి అనిల్‌కుమార్, బాలాజీ, అనిత, బీఆర్ఎస్ నాయకులు కొండవీటి ప్రదీప్‌కుమార్, రెడ్డి మాసి కిశోర్, కిరణ్‌కుమార్, రాజు, సాగర్, అభిలాశ్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో పోరాడాలి



నర్సంపేట : అమరుల స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు కోరారు. పట్టణంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయల చంద్రబోస్ 9వ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాశ్ చంద్రబోస్ చిత్రపటానికి రాజు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు మాట్లాడారు. భారత విప్లవోద్యమంలో తలెత్తిన అతివాద, మితవాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ ప్రజలందరినీ ప్రజాపంథా మార్గంలో నడిపించిన మహోన్నత విప్లవోద్యమ అగ్ర నాయకుడుగా సుభాశ్ చంద్రబోస్‌ను కొనియాడారు. బీజేపీ మతోన్మాద ఫాసిస్టు నిరంకుశ విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కత్తుల కొమురయ్య, జవహర్‌లాల్, రాజ్‌కుమార్, మనోహరాచారి, లక్ష్మి, యాకయ్య, వెంకన్న, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

కూలీల ప్రాణాలకు రక్షణేది?

- పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణం
- ప్రమాదాలు జరిగినప్పుడే కాస్త హడావుడి

నర్సంపేట రూరల్ : వలస కూలీల ప్రాణాలకు రక్షణేది? అన్న ప్రశ్న సర్వత్రా వినవస్తోంది. వ్యవసాయ పనుల కోసం కూలీలు వలసపోతున్న విషయం తెలిసిందే. అయితే పరిమితికి మించి ఆటోల్లో, గూడ్స్ ట్రాలీలు, ట్రాక్టర్లలో కూలీలను తరలిస్తున్న క్రమంలోనే ప్రమాదవశాత్తు అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గూడ్స్ ట్రాలీలు, ట్రాక్టర్లలో కూలీలను తీసుకెళ్లకూడదన్న నిబంధనను ఎవరూ పట్టించుకుంటున్న దాఖలాల్లేవు. ట్రాలీ, ఆటోడ్రైవర్లకు ప్రయాణ ఛార్జీలు గిట్టుబాటవడమే తప్ప కూలీల ప్రాణాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఆటో, ట్రాలీ డ్రైవర్లకు అవగాహన కల్పించి కూలీల ప్రాణాలకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నర్సంపేట డివిజన్ పరిధిలోని నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి మండలాల్లో మిర్చి సాగు ఎక్కువ. ఏటా మిర్చి సాగు చేసే ముందు తప్పనిసరిగా పంట మార్పిడి పద్ధతిలో భాగంగా వేరుశనగ పంట వేయడం పరిపాటి. అయితే వేరుశనగ, మిర్చి పంటల సాగులో ఎక్కువ శాతం కూలీలు అవసరం . దీంతో ఆయా గ్రామాల రైతులు సంబంధిత ఆటో డ్రైవర్లకు సమాచారం ఇస్తుండగా ఆటోడ్రైవర్లు పరిమితికి మించి కూలీలను తీసుకెళ్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే కాస్త హడావుడి చేస్తూ అధికారులు దులుపుకోవడం విమర్శలకు దారితీస్తోంది. రోడ్డు ప్రమాదాల్లో వలస కూలీలు మృతి చెందిన ఘటనలు అనేకం. చాలా మంది కాళ్లు, చేతులు కోల్పోయి ఇళ్లకు పరిమితం అవుతున్న దుస్థితి నెలకొంది.



కోనాపురం శివారులో ప్రమాదానికి గురైన ట్రాలీ ఆటో (ఫైల్)

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఆటోల్లో, గూడ్స్ ట్రాలీల్లో పరిమితికి మించి కూలీలను తీసుకెళ్తే వాహనాల డ్రైవర్లపై మోటార్ వెహికిల్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తప్పవు. రోడ్డు ప్రమాదాలపై ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పరిమితి మించి ప్రయాణికులను, కూలీలను తీసుకెళ్తున్న వారిపై కేసులు నమోదు చేసి జరిమానా సైతం విధిస్తున్నాం.

– రమణమూర్తి, టౌన్ సీఐ నర్సంపేట

కూలి రూ.250–రూ.300 చెల్లింపు

నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లోని గ్రామాల్లో మిర్చి సాగు ఎక్కువ. అయితే మిర్చి పంట కోసే సమయంలో ఎక్కువ మంది కూలీలు అవసరం. వేసవిలో గ్రామాల్లో పనులు లేకపోవడంతో మిర్చి తెంపేందుకు రావడానికి వలస కూలీలు ఆసక్తి చూపుతారు. ఈ క్రమంలో దీంతో డివిజన్‌లోని నర్సంపేట, ఖానాపురం, చెన్నారావుపేట, నెక్కొండ మండలాల నుంచి ఎక్కువగా మిర్చి ఏరేందుకు కూలీలు వస్తుంటారు. ఈ క్రమంలో కొందరు ఆటోడ్రైవర్లు 10–12 మంది సామర్థ్యం కలిగిన ఆటోల్లో 20–25 మంది వరకు ఎక్కించి తీసుకెళ్తున్నారు. గూడ్ ట్రాలీల్లో ఏకంగా 40–50 మందిని నిల్చోబెట్టి తీసుకెళ్తున్నారు. కూలీలను తీసుకెళ్తున్న డ్రైవర్లకు ఒక్కో కూలీపై రూ.50–రూ.100 వరకు ఆసామే చెల్లిస్తుండడంతో డబ్బుకు ఆశపడి పరిమితికి మించి తీసుకెళ్తున్నారు. పనులు దొరుకుతున్నాయనే ఆనందంలో కూలీలు ప్రమాదాల గురించి ఆలోచించడం లేదు. అధిక లోడ్‌తో ప్రమాదాలు చోటుచేసుకోవడంతో పలు కుటుంబాలు రోడ్డున పడుతున్న దుస్థితి నెలకొంది. అయినా పోలీస్, రవాణా శాఖల అధికారులు స్పందించడం లేదు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సంగెం : నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలిలోని జెడ్పీ హైస్కూల్‌లో 1984–85 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. 40 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న స్కూల్‌లో కలుసుకుని నాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేరిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సతీశ్ చంద్ర, మాజీ సర్పంచ్ జయపాల్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, పూర్వవిద్యార్థులు చల్లా వేణుగోపాల్‌రెడ్డి, రమేశ్, రామస్వామి, చంద్రశేఖర్, కుమారస్వామి, నర్సింహస్వామి, ప్రకాశ్, శ్రీనాథ్, అరుణ, రమ, బస్వయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్‌లో..

సంగెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2003–04 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తర్వాత 125 మంది కలుసుకోవడంతో సందడి నెలకొంది. నాడు తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులైన స్నేహలత, పరమేశ్వర్, సుజాత, జగదీశ్వర్ దాస్, సుజాత, శ్రీనివాస్, దామోదర్, సురేశ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు జున్న రాజు, బెల్లంకొండ గణేశ్, నీరటి నాగరాజు, దద్దు రమేశ్, స్రవంతి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండ: ఎలుకుర్తి హవేలీలోని హైస్కూల్‌లో..

పార్టీ శ్రేణులకు అండగా ఉంటా..

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని 21వ వార్డుకు చెందిన పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు కొంకీస మదన్‌కుమార్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆయన ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే ఆదివారం పరామర్శించారు. తొలుత మదన్‌కుమార్ చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. మదన్‌కుమార్ కుటుంబాన్ని ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. అనంతరం 19వ వార్డుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కీసరి ముత్తయ్య సతీమణి ముత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా పార్టీ నాయకులైన ఆమె కుమారులు నరేందర్, వెంకటేశ్వర్లును పరామర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి సందీప్, మార్కెట్ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, పట్టణ ఉపాధ్యక్షుడు వంశీకృష్ణ, నాయకులు చింతల సాంబరెడ్డి, కేతిడి వీరారెడ్డి, యాకూబ్‌రెడ్డి, ఎలకంటి విజయ్‌కుమార్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



మదన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి

సంగెం : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి శ్రేణులకు సూచించారు. మండలంలోని చింతలపల్లి, సంగెం, కృష్ణానగర్ గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన అవగాహనా సదస్సుల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తోందని చెప్పారు. మహిళల సంక్షేమానికి మరింత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాలనూ గతంలో లేనివిధంగా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలన్నారు. తద్వారా అర్హులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకునేలా కృషి చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు దిశగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అచ్చ నాగరాజు, పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, నాయకులు ఆగపాటి రాజు, వెంకటేశ్వర్లు, అప్పాల కవిత, గుండేటి రాజ్‌కుమార్, జగన్నాథచారి, దుద్దు రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

నూతన విద్యావిధానంతో 'కార్పొరేట్'లకే లబ్ధి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం


- డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య

నర్సంపేట : నూతన విద్యావిధానంతో కార్పొరేట్ సంస్థలకే లబ్ధి చేకూరుతుందని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య తెలిపారు. పట్టణంలోని హనుమాల్ దేవల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఆ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసేలా తప్పుడు విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. నూతన విద్యావిధానంతో ప్రభుత్వ విద్యాసంస్థలకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వెలిబుచ్చారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాలను సమాజంలోని ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలని సూచించారు. అనంతరం ఫెడరేషన్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సర్దార్, ప్రధాన కార్యదర్శిగా కొర్ర రమేశ్, జిల్లా కౌన్సిలర్లుగా దార్ల రవీందర్, ఎస్.విజయ, కొమ్మయ్య, రఘుపతి, ఉపాధ్యక్షులుగా కె.విజయ, బి.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా పాలడుగుల రాజేందర్, గుగులోతు భిక్షపతి, శోభన్‌కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బుచ్చిరాములు, సభ్యులుగా శ్రీనివాసరావు, మర్ద వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఫెడరేషన్ పూర్వ జిల్లా అధ్యక్షుడు గుంటి రాంచందర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు నెల్లుట్ల భాస్కర్, నల్లబెల్లి అధ్యక్షుడు పూజారి రవి, ఖాజామైనొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 6తో అన్యాయం

- ఉద్యోగుల సమితి అధ్యక్షుడు రవీందర్

వర్ధన్నపేట : ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన జీఓ నంబర్ 6తో నాల్గో తరగతి ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతోందని నాల్గో తరగతి ఉద్యోగుల సమితి పట్టణ అధ్యక్షుడు రవీందర్ అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమితి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆఫీస్ సబార్డినేట్లుగా సుమారు 25 ఏళ్లుగా పని చేస్తున్న ఉన్నత విద్యార్హతలు కలిగిన వారికి అన్యాయం చేసేలా జీఓ నంబర్ 6 ఉందన్నారు. సదరు జీఓతో ఆఫీస్ సబార్డినేట్, నైట్ వాచ్‌మెన్ పోస్టులను న్యూమరైజ్ చేస్తూ కారుణ్య నియామకంలో అసిస్టెంట్లుగా నియమించడంతో నాల్గో తరగతి ఉద్యోగులు నష్టపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. రెండున్నర దశాబ్దాలుగా ఉద్యోగం చేస్తూ డిగ్రీ, పీజీ, బీటెక్, తదితర ఉన్నత విద్యార్హతలు కలిగిన సబార్డినేట్లు జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తు చేసుకుంటే ఖాళీలు లేవంటూ ఇతర శాఖల నుంచి వచ్చిన వారిని జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమకు సైతం న్యూమరైజ్ చేసి అర్హతకు తగిన ప్రమోషన్లు కల్పించాలని కోరారు. సమావేశంలో సమితి సభ్యులు ఎం.వెంకటేశ్వర్లు, జావెద్, కంచర్ల ప్రభుదాస్, గాయాల సుమన్, అరుణ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ రశీదులతో రవీందర్, సభ్యులు

శిథిలావస్థలో పశువుల ఆస్పత్రి

- యూత్ భవనంలో సబ్‌సెంటర్
- వైద్యులు, సిబ్బందికి ఇబ్బందులు

నల్లబెల్లి : మండల కేంద్రంలోని పశు వైద్యశాల భవనం శిథిలమైంది. శిథిలావస్థలో ఉండగా రేలకుంట సబ్‌సెంటర్ (ఉపపశు వైద్యశాల)ను కూల్చివేసి సుమారు రెండేళ్లు గడచింది. అది యూత్ భవనంలో కొనసాగుతుంది. ఈ క్రమంలో వైద్యులు, సిబ్బందితోపాటు రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

స్థానిక ప్రాథమిక పశు వైద్యశాల పరిధిలో రేలకుంటలో సబ్‌సెంటర్ ఉంది. వీటి పరిధిలో 11 గ్రామ పంచాయతీలుండగా ఆయా గ్రామాల్లో 4980 ఆవులు, ఎద్దులు, 4543 గేదెలు, 4062 మేకలు, 29073 గొర్రెలున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటితోపాటు కోళ్లు అదనం. వీటి పరిధిలో అర్వపల్లి, లెంకాలపల్లి, ముచ్చింపుల, నల్లబెల్లి, నందిగామ, నారక్కపేట, రాంతీర్థం, రంగాపురం, రేలకుంట, రుద్రగూడెం, శనిగరం గ్రామాల్లో వైద్యులు, వైద్యసిబ్బంది సేవలు అందిస్తున్నారు. నల్లబెల్లి ఆస్పత్రిలో పశువుల వైద్యసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన షెడ్ రేకులు ధ్వంసం అయ్యాయి. దీంతో ప్రస్తుతం ఎండాకాలం నేపథ్యంలో ఎండ తీవ్రతలో సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక పశువైద్యశాలలో రెగ్యులర్ వైద్యులు, సిబ్బంది సేవలు అందిస్తుండగా రేలకుంట సబ్‌సెంటర్‌లో ఇన్‌చార్జ్ వైద్యుడు విధులు నిర్వర్తిస్తున్నారు.

సబ్‌సెంటర్ భవనం కూల్చి రెండేళ్లు

రేలకుంటలోని సబ్‌సెంటర్ భవనం శిథిలమైపోగా సుమారు రెండేళ్ల క్రితం కూల్చారు. అది నాటి నుంచి యూత్ భవనంలో కొనసాగుతుంది. ఈ క్రమంలో సరైన వసతులు లేకపోవడంతో వైద్యులు, సిబ్బందితోపాటు రైతులకూ ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో ఆవులు, ఎద్దులు, గొర్రెల, మేకల పెంపకం ఎక్కువ. ప్రభుత్వం నిధులు కేటాయించి నూతన భవన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది.



శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పశువుల ఆస్పత్రి భవనం

మరమ్మతులు చేపట్టాలి



పశువుల ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో సదరు భవనంలోనే సేవలు అందించడం వైద్యులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేసి భవన నిర్మాణ పనులు చేపట్టాలి.

– నాగెల్లి అనిల్, పాడి రైతు, నల్లబెల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రాథమిక పశువుల ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాము. రేలకుంట సబ్‌సెంటర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించిన వెంటనే సమస్యల పరిష్కార దిశగా పనులు మొదలవుతాయి.

– వేణు, పశు వైద్యాధికారి, నల్లబెల్లి

'ఓంకార్ ఆశయాలే ధ్యేయం'



సంగెం : నర్సంపేట మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ ఆశయాల సాధనే ధ్యేయంగా ఎంసీపీఐ (యూ) ప్రజల పక్షాన పోరాడుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. మండలంలోని వంజరపల్లిలో బండి బుచ్చయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పార్టీ వరంగల్ డివిజన్ పార్టీ సభ్యుల జనరల్ బాడీ సమావేశానికి రవి అతిథిగా హాజరై మాట్లాడారు. ఓంకార్ శ్వాస ఉన్నంత వరకు పీడిత ప్రజల పక్షాన నిలిచాడని తెలిపారు. భూమి, భుక్తి, విముక్తి కోసం రైతాంగ సాయుధ పోరాటాలు నిర్మించారని కొనియాడారు. పాలకులు అవలంబిస్తున్న తప్పుడు విధానాలపై ఓంకార్ స్ఫూర్తితో పోరాటాలు నిర్మిస్తామని చెప్పారు. ఓంకార్ శత జయంతి ఉత్సవాలు ఈ ఏడాది మే 12 నుంచి వచ్చే ఏడాది మే 12 వరకు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మే 12న మచ్చాపూర్‌లోని ఓంకార్ స్తూపం వద్ద ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఓంకార్ ప్రజల కోసం చేసిన పోరాటాలను వివరించి దోపిడీ వ్యవస్థను రూపుమాపే దిశగా ప్రజలు సమరశీల పోరాటాలకు సిద్ధం అయ్యేలా శ్రేణులు చైతన్యవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, గోనె కుమారస్వామి, ములుగు జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య, నాయకులు ఇస్మాయిల్, బత్తిని కుమారస్వామి, గూడ సురేశ్, సోమిడి రవి, ఆదినారాయణ, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

- సంఘం రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి

సంగెం : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లక్కమారి కాపు కులస్తులు సత్తాచాటాలని లక్కమారి కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి గూడ సుదర్శన్‌రెడ్డి కోరారు. మండలంలోని కుంటపల్లిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్కమారి కాపు కులస్తులు విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, ఇతర అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉన్నారని చెప్పారు. రాజకీయ పార్టీలు లక్కమారి కాపు కులస్తులను ఓటు బ్యాంకుగా మాత్రమే భావిస్తున్నాయని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు లక్కమారి కాపు కులస్తులకు అన్ని ఎన్నికల్లోనూ సముచిత అవకాశాలు కల్పించాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కులస్తులు పోటీ చేసి గెలవాలని ఆకాంక్షించారు. అనంతరం సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పెండ్లి లింగయ్య, అధ్యక్షుడిగా పెంతల సంపత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కద్దూరి సురేందర్, పొన్నాల మోహన్, పెండ్లి శంకర్, యార బాలచందర్, ప్రధాన కార్యదర్శిగా అనుముల రాజు, కోశాధికారిగా గోనె రాంచందర్, సహాయ కార్యదర్శిగా పెండ్లి రవి, కార్యవర్గ సభ్యులుగా ఎరుకల రాజు, కద్దూరి సుధాకర్, యార రాజయ్య, పెండ్లి రాజు, పెండ్లి శేఖర్ ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు పెండ్లి పురుషోత్తంరెడ్డి, కొట్టం రాజు, పెంతల జనార్దన్, యార బాలకృష్ణ, పెంతల ప్రతాప్‌రెడ్డి, లింగమూర్తి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ఎస్సీలను ఏబీసీడీగా వర్గీకరించాలి

దామెర : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ 123 కాకుండా ఏబీసీడీగా వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో లక్ష డప్పులు వేయి గొంతుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలకుపైగా మంద కృష్ణ పోరాటం చేయడం వల్లే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. మందకృష్ణ తలపెట్టిన లక్ష డప్పులు వేయి గొంతుల కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి మేథావులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు హైదరాబాద్ తరలిరావాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి 9 శాతం కాకుండా 11 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు వేల్పుల శ్రీను, నాయకులు కుమార్, చిరంజీవి, హరీష్, యాకూబ్, జైపాల్, రమేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో చదివితే మెరుగైన ఫలితాలు

- లీడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు రవికుమార్

చెన్నారావుపేట : అంకితభావంతో చదివితే మెరుగైన ఫలితాలు వస్తాయని లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాసుల రవికుమార్ స్పష్టం చేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలోని పదో తరగతి విద్యార్థులకు లీడ్ ఆదివారం ఆయన పరీక్ష సామగ్రి అందజేసి మాట్లాడారు. జీవితంలో పదో తరగతి కీలకమని చెప్పారు. క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ జ్యోతి మాట్లాడారు. ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తూనే ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తోడ్పాటు అందించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో లీడ్ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ నర్మెట్ట యాదగిరి, జాయిన్ హాండ్స్ ఫౌండేషన్ సభ్యులు రంజిత్‌కుమార్, సందీప్, రాజు, ఉపాధ్యాయులు షాహీనా, సుజాత, ఉమ, రాజ్యలక్ష్మి, యశోద, అనిత, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.